

# ప్రేమ

## – యండమూరి వీరేంద్రనాథ్



### ఒకమాట

**కొన్ని నవలలు** రచయిత వ్రాసేప్పుడు అద్భుతంగా ఉందనే అనుకుంటాడు. కానీ అది మార్కెట్‌లో విడుదలయ్యాక పాపులర్ కాదు. పాపులర్ అంటే.. అమ్మకాలు అంత గొప్పగా ఉండవు. అంటే ఎక్కువమంది చదవరన్నమాట. అలాంటప్పుడు రచయితకి కొంచెం నిరాశ తప్పదు. అలాంటి కేటగిరీకి చెందిన నవల ఈ ‘ప్రేమ‘. నాకున్న స్టాండర్డ్ కి, నేనీ నవల వ్రాయడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఎందుకంటే తెలుగు సరిగా రాకపోవడం వల్ల, ప్రబంధాలవీ చదవడం ..ఇలాంటి వాటి వల్ల. ఇంత కష్టం నవల అమ్మకాల్లో కనిపించకపోయే సరికి నిరాశపడ్డాను. ఇప్పుడు ‘కౌముది ‘ లాంటి సాహితీ పత్రిక దీన్ని సీరియల్‌గా ప్రచురించడానికి ముందుకు రావడం నాకు చాలా ఆనందంగా ఉంది.

ఇందులోని వర్ణనలు వ్రాయడానికి కాస్త కష్టపడాల్సి వచ్చింది. నేననుకున్న థీమ్ పాఠకులకి సరిగా అందలేదు. నేను చెప్పదలుచుకున్నదేమిటంటే రెండు విభిన్న లక్ష్యాలున్న హీరో, హీరోయిన్లు – జీవితంలో గుర్తుండిపోవడానికి ఒక నెలరోజులు కలిసి ఉండి తర్వాత ఎవరి గమ్యానికి వాళ్ళు వెళ్ళిపోతారు. ఇది నేననుకున్న థీమ్. దీంట్లో మెలో డ్రామా తక్కువవడం, ఆశించినన్ని మలుపులు లేకపోవడం, వీరేంద్రనాథ్ దగ్గరనుంచి పాఠకులు ఆశించింది సరిగా లేకపోవడం, – ఇలాంటి వాటి వల్ల బహుశా పాఠకులకి నచ్చలేదనుకుంటాను. బట్ స్టిల్ ఐ బిలీవ్ – కాలం గడిచే కొద్దీ నా నవలల చరిత్రలో ఇది ప్రత్యేకంగా నిలుస్తుందని ఆశిస్తున్నాను. ఈ నవల చదివి మీ అభిప్రాయాలి నిష్కర్షగా నాకు వ్రాస్తే సంతోషిస్తాను. Thank you very much..!

- యండమూరి వీరేంద్రనాథ్ yandamoori@hotmail.com

## (గత సంచిక తరువాయి)

పదినిముషాలు గడిచినా భారతి బయటకి రాకపోయేసరికి అరుణ్ హతాశుడయ్యాడు. అసలా అమ్మాయి అంత ధైర్యం చేయగలదని అతడనుకోలేదు కూడా. కాగితం విసిరేసరికి ‘ఫర్వాలేదు ధైర్యస్తురాలే‘ అనుకున్నాడు. ఆమె తన ఉత్తరాన్ని తీసుకోవటంతో మరింత నమ్మకం కుదిరింది.

చలిలో, ఆ చీకటిలో నిల్చున్న అరగంట సేపటికి అతడిలో నమ్మకం సడలసాగింది. ఇక ఆ అమ్మాయి రాదు అని నిశ్చయించుకుని అతడు ఆ ప్రదేశం నుంచి వెళ్ళిపోవటానికి ఆయత్తమవసాగాడు.

అప్పుడు వెనక తలుపు తీస్తున్న అలికిడి వినిపించింది. అతడి గుండె వేగం హెచ్చింది.

చీకటిలో వస్తూన్న ఆకారం స్పష్టంగా కనిపించలేదు. తీరా దగ్గరకొచ్చాక ఆమెని చూసి అవాక్కయ్యాడు.

ఆమె సంహిత.

అతడికి ఏం చేయటానికి పాలుపోలేదు. అటునుంచి వెనక్కి తప్పుకోవటానికి కూడా దారిలేదు. 'దొంగ - దొంగ' అని అరుస్తుందేమో అని భయపడ్డాడు.

కానీ ఆమె అతడిని గమనించలేదు. బావివరకూ వెళ్ళి, చేదతో నీళ్ళు తోడి, కాళ్ళూ - చేతులూ, మొహం కడుక్కుని వెనుతిరిగింది.

వస్తూ అప్పుడు చూసింది అతడిని.

"ఎవరది?" అంది.

అతడు కంచె దూకి పారిపోదామనుకున్నాడు. కానీ అది మరింత ప్రమాదానికి దారి తీస్తుందని, అడుగు ముందుకు వేసి, "నేనే సంహితా. అరుణ్‌ని" అన్నాడు.

ఆమె విస్తుబోయినట్టు "అ...రు..ణ్" అంది.

"ఈ సమయంలో ఇక్కడ?"

అతడింకా ఆలోచించుకోలేదు. ఆమే తిరిగి అన్నది "నువ్వు.. నువ్వు నా కోసం ఈ చీకట్లో నిలబడి ఉన్నావా? నేను వస్తానని ఎలా అనుకున్నావ్? అయినా ఇది నీకు భావ్యంకాదు అరుణ్. నా గురించి నీకేమీ తెలియనప్పుడు సరే. కానీ ఇప్పుడు నీకు తెలుసుగా నా పరిస్థితి"

చీకటిలో నడుస్తున్న వాడికి ఆధారం దొరికినట్టు అయింది. తన గురించి ఆమెకు మరో విధమైన అనుమానం రావటంతో తేలిగ్గా శ్వాస పీల్చుకున్నాడు. "అవును సంహితా, నీ కర్థం కాదులే. ఈ చీకటే కాదు తెల్లవారేవరకూ ఈ చలిలో ఇలాగే నిలబడి ఉండేవాడిని. ***ప్రేయసి గది కిటికీలోంచి బయట పడే వెలుతుర్ని చూస్తూ ఉండటం కూడా తృప్తి ఇవ్వటమే ప్రేమంటే.***"

"అరుణ్. అలా మాట్లాడకు ప్లీజ్."

ఆమె మెత్తబడటం చూసి అతడు అడుగు ముందుకు వేసి దగ్గరగా వచ్చాడు.

"నువ్వు వివాహితవని తెలియకముందు నిన్ను ఆరాధించాను. తెలిశాక దూరం వెళ్ళాలనుకున్నాను. వెళ్ళాను కూడా. కానీ, తెలియని పాశమేదో నన్ను ఇటే లాగటం ప్రారంభించింది. ఒక్కటి స్పష్టమైంది సంహితా. నేను నీ నుంచి దూరంగా ఉండలేను. ఒక్క ఆరాధకుడిగా నైనా నన్ను ఇలా మిగిలి పోనీ. వెళ్ళు సంహితా.. లోపలికి వెళ్ళు.."

"ప్రతీ సాయంత్రం నువ్వు ఇటువైపు వస్తూంటే నా కోసమేనని అనుకున్నాను. మళ్ళీ ఇంకొక అనుమానం కూడా వచ్చింది. భారతి కోసం వస్తున్నావేమోనని."

"భా...ర...తి కోసమా?"

"అవును. ఆ అమ్మాయిని ఆ రోజు జలగ బారినుంచి రక్షించావుగా, నువ్వంటే ఆ క్షణం నుంచీ తనకి ఇష్టం ఏర్పడినట్టుంది. చాలసార్లు నీ గురించి ప్రస్తావించింది. అందుకని నాకనిపించింది. తన కోసమే వస్తున్నావేమోనని."

"తను నన్ను అపార్థం చేసుకున్నట్టుంది. అయినా మూడురోజుల్లో వివాహం జరగబోతున్న అమ్మాయి నా పట్ల ఆశలు పెంచుకోవటం ఏమిటి?"

అతడి మాటలు పూర్తికాకుండానే వెనుక పెరడులో లైటు వెలిగింది.

అరుగు మీద భారతి నిల్చుని ఉంది.

సంహిత అటు చూస్తూ "అయ్యో అక్కడే నిలబడిపోయావేమిటి భారతీ. వెళ్ళి నూతి దగ్గిర కాళ్ళు కడుక్కో ఇంకా నువ్వు స్నానాల గదిలోనే ఉన్నావనుకుని, ఇదిగో అరుణ్ కనపడితే మాట్లాడుతూ ఉండిపోయాను. వెళ్ళొస్తా అరుణ్" అంటూ భారతివైపు కదిలింది.

అప్పటికే అరుణ్ మొహం చీకటికన్నా నల్లగా మారి ఉంది.

●●●

"జరిగినదానికి బాధపడకుండా జరగవలసిన దాని గురించి ఆలోచించటమే జీవితం భారతీ. తొందర తొందరగా నీ మొహంలోకి చిరునవ్వు తెచ్చేసుకోవాలి మరి." నవ్వుతూ అన్నాడు అభిషేక్.

భారతి తల వంచుకుని కూర్చుని ఉంది.

అది అంత సులభం కాదని అతనికీ తెలుసు.

"నీకు తెలుసా! చదువుకునే రోజుల్లో నేనేం ఊహించుకునే వాడినో?" అన్నాడు మాట మారుస్తూ, ఆమె ఆసక్తిగా తలెత్తింది.

"భారత దేశం గురించి చదవటమే కానీ ఎప్పుడూ చూడలేదుగా. ఆంధ్రదేశంలో ఒక మారుమూల గోదారి పక్క పల్లెటూరులో అమ్మాయిని చేసుకోవాలి అని బాగా అనుకునేవాణ్ణి. ఆ అమ్మాయికి ఓ తమ్ముడుండాలి. ఒకే ఒక తమ్ముడన్న మాట. మరీ వయస్సు ఎక్కువ ఉండకూడదు. పాంట్లేసుకునే వయసు లేకపోయినా పాంట్లు వేసుకోవాలన్న తొందర ఎక్కువ ఉండే వయసన్నమాట."

భారతి నవ్వింది.

"ట్రైన్ స్టేషన్‌లో ఆగుతుంది. బావగారిని రిసీవ్ చేసుకోవటానికి అతగాడు తండ్రితో కలిసి వస్తానన్నాడు. అక్కడ నుంచి కలువ పక్కనే గంటసేపు ఎడ్లబండి మీద ప్రయాణం, గతుకుల రోడ్డు అల్లుడిగారికి పందిరి మంచం గది ఎలాట్ చేస్తారు. ఆ అమ్మాయేమో వంటింటిలోంచి రాదు. 'వెళ్ళవే, వెళ్ళవే' అని తల్లి సణుగుతూ ఉంటుంది. ఆ కొత్త పెళ్ళికూతురు సిగ్గపడుతూ కాఫీ తెచ్చి బల్లమీద పెడుతుంది. పరుగెత్తి అక్కణ్ణించి వెళ్ళాలనీ ఉంటుంది. వెళ్ళకూడదనీ ఉంటుంది. అంటే కాళ్ళు కదలవు. వాటి వేగం కూడా చూపులే ఆపాదించేసుకుని అటూ ఇటూ పరుగెడ్తూ ఉంటాయన్నమాట."

భారతి కిసుక్కున నవ్వింది.

"అక్కడ హీరో నేను కాదు. మా బావమరిది. వాడు సాయంత్రం ఎప్పుడవుతుందా, పల్లెనంతా బావగారికి చూపించాలన్న తొందరలో ఉంటాడు. సరే. నేను నిద్రలేస్తాను. ఇద్దరం కలిసి ఊరిమీద పడతాం. ఆ పల్లెలో ఒకే ఒక టూరింగ్ టాకీస్ ఉంటుంది. ఇద్దరం మొక్కజొన్న పొత్తులు కొనుక్కుని తింటూ సత్యహరిశ్చంద్ర సినిమా చూస్తాం. ఇంటర్వెల్‌లో ఇంటికెళ్ళి పోదామంటాన్నేను. వాడికి పూర్తిగా చూడాలని ఉంటుంది.

కానీ, పెద్దరికం ఆపాదించేసుకుని 'సర్లే' అని గంభీరంగా తలూపుతాడు.

ఇంటికొచ్చేసరికి తలుపు వెనుక అమ్మాయి దిగులుగా నిల్చుని ఉంటుంది. లోపల్నుంచి వాళ్ళమ్మ తిట్లు. "వాళ్ళతో కలిసి వెళ్ళవే అంటే బింకాలు పోయావు. ఇప్పుడా తలుపులు పట్టుకుని వేళ్ళాడ్డమెందుకు? అక్కడవరకూ వచ్చిన వాళ్ళు లోపలికి రారా ఏమిటి?" అని వినపడుతూ ఉంటాయి. మమ్మల్ని చూసి అమ్మాయి లోపలికి తుర్రున పరుగెడుతుంది. ఆ లోపులో ఇంక రాత్రవుతుందన్నమాట."

"చాల్చాలు" అని భారతి చెవులు మూసుకుంది.

"చదువుకునే రోజుల్లో ఈ కథ అమెరికాలో మా మెడికోస్‌కి చెపితే అసూయతో ఉడుక్కుని చచ్చారు."

"వాళ్ళు ఉడుక్కున్నారేమో కానీ ఇక్కడ మాత్రం అలాంటి టూరింగ్ టాకీసులూ, ఆడపిల్లలూ ప్రస్తుతం లేరు" నవ్వింది.

అతడు నవ్వలేదు. "టూరింగ్ టాకీసు లేదేమో కానీ ఆప్యాయతలున్నాయిగా భారతీ" అన్నాడు. ఆమె నిరుత్తరాలై చూసింది.

"నా మనోఫలకం మీద అదొక అద్భుత దృశ్యం. ఆ దృశ్యానికి వాడిన రంగులన్నీ, అనురాగం కుంచెతో ప్రేమ ఫలకం మీద అద్దినవే. పదహారేళ్ళపాటు పెంచిన ఒక తండ్రి, ఒక తల్లి - ఆ బంధం.. అన్నీ వదులుకుని ప్రేమించిన వ్యక్తికోసం అందర్నీ బాధపెట్టి నిజంగా అందర్నీ వదిలి పెట్టగలిగేటంత ప్రేమ ఒక వ్యక్తిమీద కలిగితే మంచిదే కానీ అది నిజంగా ప్రేమేనా? ఆకర్షణ కాదుకదా. ఆలోచించు భారతీ. నా ఉద్దేశ్యంలో ***ప్రేమ అన్నది సాయంకాలం నీడలాంటిది. ఆకర్షణ - మేఘం వల్ల వచ్చిన నీడల్లే.. అదెంత గాఢమైనదయినా... తాత్కాలికమైనది.***"

## *6*

**"అల్ల ఊరీవారు పిల్లనడిగేరు**

**ఇల్లలికి ముగ్గెట్టి పెళ్ళిసేతాము.."**

ముందు రోలుకు పూజచేయటంతో వివాహ కార్యక్రమం మొదలయింది వడ్లు దంచారు. పసుపు దంచి పెళ్ళి పనులకు శ్రీకారం చుట్టారు.

గృహాంగణాన గృహిణులందరూ కలిసి ముగ్గులేస్తుంటే, మరో పక్క మంగళవాద్యాలు మ్రోగుతుంటే -

ఇంటిముందు కొబ్బరాకు పందిర్లు.. ఇంటి చుట్టూ పచ్చటాకు తోరణాలు.

పొలాల అవతల సూర్యుడు కృంగిపోతున్న సంధ్యా సమయంలో మొగపెళ్ళివారి బళ్ళు బారలు తీర్చి ఒకే వరసన కాలువ గట్టంటే రావటం అపురూప దృశ్యం. పల్లెకే నిండుదనం వచ్చినట్టుంది. కాలువ తలపైకెత్తి చూసింది.

పెండ్లి మండపాన ధాన్యం 'పోలు' (యజ్ఞ వేదికా చిహ్నం) వేసారు. ముత్తయిదువలు తమ పుస్తెలకు పసుపు నంటించుకుని, పరస్పరం మెడలకు గంధం పూసుకుని, సుంకులు చెరగ నారంభించారు. గ్రామదేవాలయం దగ్గర విడిది చేసిన మొగపెళ్ళివారికి ఉపహారాల్నంపేరు.

కొత్తగా ఊరిలోకి ప్రవేశించే మొగపెళ్ళివారు దేవాలయం దగ్గర ఆగటం ఆచారం. జోడు కంబళ్ళు పరచి, వచ్చిన వారిని అక్కడ కూర్చోబెట్టి సన్నాయి మేళతాళాలతో ఆడపెళ్ళివారు ఎదురేగి మంగళ హారతులు, కుంకుమ, బుక్కగులలు ఇచ్చి పరస్పరం పరిచయాలు చేసుకున్నారు. ఆ తరువాత బుక్కగులాలు చల్లుకుంటారు. దీన్నే "ఎదురుకోళ్ళు" అంటారు. అరమరికలు పోయి, ఒకరి కొకరు దగ్గిరవటానికి ఇది ఉపయోగ పడుతుంది.

"వనజాక్షి.. వేగరావే, వనితా నలుగిపుడు" అంటూ నలుగుపెట్టి అత్తరు సంపంగె నూనెలతో ముద్దురాలిని స్నానమాడించి, కర్పూర సుగంధాల్ని అలరించారు. 'తిలకం దిద్దరే కలికి శ్రీ రుక్మిణికి..' అని పాడుతూ నుదుట కళ్యాణ తిలకమిడి కూతుర్ని పెళ్ళి కూతుర్ని చేసారు.

ఎనిమిది రోజుల పెళ్ళి అది. ఊరి ఊరందరికీ ఎనిమిదిరోజుల పాటు అక్కడే భోజనాలు. పిల్లలు నాలుగుస్థంభాలాట - పెద్దలు చతుర్ముఖ పురాణం - కొందరు పిల్లలు కొబ్బరాకు బూరలూదుతున్నారు. కొందరు పెద్దలు పనిలేక హడావుడి పడుతున్నారు.

***<u>మొదటిరోజు</u>***

పెళ్ళికూతురు అవిరేణి పూజ.

వేదిక పక్కనే అవిరేణి కుండలున్నాయి.

లగ్నం రెండు రోజులుండగానే పెళ్ళివారు మేళతాళాలతో కుమ్మరింటికి వెళ్ళి మట్టికుండల్ని తెస్తారు. తెల్లని కొత్తబట్టను నాలుగువైపులా నలుగురు పట్టుకోగా, మధ్యలో ఒకడు బెత్తంతో గొడుగులా పైకెత్తి నడుస్తాడు. కుండలకు బంగారు గొలుసు తగిలిస్తారు. అవే అవిరేణి.

మనిషి జీవితం మట్టితో ముడిపడి ఉంది. కుండలకి పూజ చేయటం అందుకే మట్టినీ, మేఘాన్నీ, మొక్కనీ ప్రేమించలేనివాడు ప్రపంచంలో దేన్నీ ప్రేమించలేడు.

***రెండోరోజు..***

పసిడి పళ్ళెంలో పాదాలు కడిగి, అపరంజి పళ్ళెంలో ఆర్తిపట్టి కుడిపాదమెత్తించి, గడప దాటించి.. పెళ్ళి కూతుర్ని వేదిక దగ్గిరకి తెచ్చారు.

ముసిముసినవ్వుల్తో ముత్తైదువులు ముగ్ధని ముద్దుగుమ్మని చేసారు.

***మూడోరోజు***

ముందుగ పురోహితులు మంత్రాలు చదువగ.. పొందుగ మేళతాళాలు మ్రోయించగ - ఇంచుక భారతి తలవంచగ - కనుల విందుగా గళసీమ చేరెనొక కొత్త సూత్రము.

ఆపై నలువైపుల్నించీ అక్షింతలు - వధూవరుల మోముపై ముసిముసి నవ్వులు మరిన్ని అక్షింతలు.

చేయి కలిపి, కాలు తొక్కాడు. కాలిమెట్టి ఆలిగుర్తయింది.

అబ్బాయి అతనయ్యాడు. అమ్మాయి ఆమె అయ్యింది.

ముత్యాల గురువిందాలు తలంబ్రాలయ్యాయి. బంధుమిత్రుల కానుకులు చదివింపులయ్యాయి.

ప్రతి శుభకార్యం తరువాత మంగళహారతి చక్కని ఆచారం కదా! 'సీతకు సూత్రం కట్టిన రామా! నీకు మంగళహారతులివిగో' అని పాడారు పడతులు.

***నాలుగో రోజు***

నాకబలి నాగప్రతిమకు పూజ చేశాక అల్లుడుగారు అలిగారు. ఇంటి ఎదురు వంటి స్థంభం మేడ కట్టించమని మొదలెట్టి అంటు మామిడి తోట అరణ మిచ్చినగానీ అలుక తీరదనీ, పందిరి మంచం పట్టుపరుపులకై పట్టువిడుపు లేదనీ భీష్మించుకు కూర్చున్న అల్లుడు - మెట్లుదిగొచ్చి రిస్టువాచీకే సర్దుకున్నాక -

***అయిదోరోజు***

వధూవరులచే పత్తి విత్తులు నాటించారు. పత్తిపూల వంటి బిడ్డల్ని కనమని దీవించారు. మరదళ్ళూ, బావలూ ఆటపట్టించారు. ఆడపడచులు కొత్త కోడల్ని మొగుడి పేరు చెప్పమని మెట్ల దగ్గర అటకాయించారు

ఆ తరువాత బంతులాట. పరపురుషుడి ప్రథమ స్పర్శకు పడితిని సమాయత్తపరచటం కోసం ఇన్ని హంగులు చేయాలి. ఇన్ని తెరలు తీయాలి. అప్పుడు గానీ, స్త్రీ సిగ్గుతెరల్లోంచి బయటకు రాదు. వివాహత్పూర్వ ప్రేమావేశంలో ప్రియుడిని పార్కుల్లో కలిసే అమ్మాయికి అనవసరమేమో కానీ, ముద్దబంతి పువ్వల్లే ముగ్ధంగా పెరిగిన ముద్దురాలికి మాత్రం ఈ అనుభవం అపురూపం. అద్భుతం. అనిర్వచనీయం.

బంతులాటకి ముందు అమ్మాయి చేత ఆకు వక్కలు నోటి కందింపచేస్తారు. బంతులాట తరువాత వసంతాలాట.

తలవంచి తొడిమ తీసి తమలపాకు చిలక చుట్టి అతడి నోట పెట్టినప్పుడు అర సిగ్గు పాయె. పాలబంతులు కదిలేలా పూలబంతులు విసిరేవేళ, పావు సిగ్గు పారిపాయె. తన బుగ్గ సిగ్గుమొగ్గల ఎర్రరంగు దీసి అతడిపై పూసి వసంతాలాడు వేళ - మిగిలిన కూసింత సిగ్గూపాయె.

ఆ విధంగా మొదటి రాత్రి కోసం మనసు సమాయాత్తమయింది.

అయిదురోజుల పెళ్ళి అయ్యాక అంపకాలు.

ఒడినింపి, సారెవోసి, వధువు నత్తవారింటికి పంపువేళ,

తల్లి తన బిడ్డకు తగు నీతులు గరిపి, అత్తచేతుల కప్పగించేవేళ,

ఆడబిడ్డని కని కనులార పెంచి, చెయ్యెత్తు దానిని ఒక అయ్య చేతుల కందించువేళ - ముంచుకుని వచ్చు తల్లి దుఃఖానికి ఎల్లలేవి? తండ్రి కనురెప్పల క్రింద కదులు కన్నీటికి చెలియలి కట్టలేవి? రాతి గుండెకైనా కనులు చెమర్చక తప్పదు. చూపరుల మనసు చెమ్మగిల్లక తప్పదు.

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments